# అలవాటు

[కథానిక]

శ్రీ ఇవటూరి కామేశ్వరరావు

“ఏమండీ!...మిమ్మల్నే కాఫీ చల్లారి పోతోంది” ఉదయాన్నే కాఫీ ఇవ్వడం ఆమెకు బాగా తెలుసు. మద్రాసులో కాపురం పెట్టిన తరువాత వారికి కాఫీ బాగా అలవాటయింది. కాఫీ లేకపోతే ఉండలేరు.

అదేమిటో ఆ కాఫీకి అదేం శక్తో - విచిత్రమైన శక్తి. ఆ కాఫీ ఏ విధంగా ఇవ్వాలో లక్ష్మికే బాగా తెలుసు. మరొక్క చెంచాడు పంచదార వేసి రుచి చూచింది కాఫీ. ఆమె ముఖంలో లేతనవ్వు తొణికిసలాడింది. రావుకు వేడి కాఫీ అంటే చాలా యిష్టం. అందులో ఈ రోజు ఉదయం లక్ష్మి ప్రత్యేకించి జాగ్రత్తగా తయారుచేసింది.

రావుదికూడా చాలా మెత్తటి మనసు. అయితే అతనికి కొంచెం కోపం ఎక్కువ. అందరికి మల్లేనే కోపం ముక్కుమీద ఉంటుంది. ఏ మాత్రం హెచ్చుతగ్గులు వచ్చినా సహించే ఘటం కాదు అతనిది. అతని కోపానికి అతనేం చేయగలడు? ఎవరు ఏం చేస్తారు గనుక? అందులో ఇటీవల అతడు జబ్బు పడ్డప్పటి నుంచీ కోపం మరి కొంచెం ఎక్కువయింది. లక్ష్మికి ఉండే ఓర్పు అతనిలోవుంటే...? అయితే లక్ష్మి తర్ఫు ఆయింట్లో జరిగే సంఘటనలకు తట్టుకుని ఆదుకుని రావడం పరిపాటు అయిపోయింది.

ఆ రోజు రావు ముఖంలో చిరునవ్వు లేదు. ఆ క్రితం రోజు రావు ఆఫీసులో తన ఆఫీసరు ఏదో చిన్నతప్పుకు తనమీద కారాలూ మిరియాలూ నూరడం ఏదో జరిగింది. కాగా రావు తిరిగి సమాధానం ఇవ్వలేక చేసిన తప్పుకు క్షమాపణ వేడుకోవలసి వచ్చింది. కాని అతని మనస్సులో ఉద్రేకం చెలరేగింది. విశ్వాసం లేని తన ఆఫీసరుమీద చెలరేగిన ఆ కోపానలజ్వాల అక్కడికక్కడికే ముకుళించుకుని పోయినప్పటికీ ఆ జ్వాల ఇంటివరకూ కూడా ప్రాకి వెళ్లడం అతనిగ్రహపాటే.

సమయం సాయంకాలం. కుర్చీలో రావు మౌనంగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు. సాయంత్రం ఆమె యిచ్చిన టీ చాలా బాగుంది. కాగా లక్ష్మిమీద కేకలు వెయ్యడానికి ఏమీ సాకులు కూడా లేవు. చిట్టితల్లి ప్రక్కవాళ్ల అమ్మాయితో ఆడుకుంటోంది. ఆట తమకంలో ఉంది. పాపం— తన చిట్టితల్లి క్రికెటుబ్యాటు సంగతేమరచిపోయిందనుకున్నాడు రావు. ఆవీధి ఎదురింటి అమ్మాయి దగ్గర ఒకబ్యాటు ఉంది. అదిచూచి నప్పటినుంచీ తనకు కూడా ఒకబ్యాటు కొనిఇమ్మని తన్ను వేధించుకుతింటూ వచ్చింది. అయితే చిట్టితల్లిని వచ్చే వారందాకా ఆగమన్నాడు రావు—జీతాలు వచ్చే వరకూ!

భోజనం అయింది. ఆరోజు పదార్థాలు బాగున్నాయేమో రావుకు కడుపునిండింది. అదృష్టవశాత్తూ లక్ష్మి తాను భోజనం చేసేటప్పుడు ఇంటి అద్దెను గురించి గాని ‘బియ్యంరేషను’ కు డబ్బును గురించి కాని అతనిజ్ఞప్తికి తీసుకురాలేదు. తన ఆఫీసరు వేసిన కేకలు మరచి పోసాగాడు రావు. తన చిట్టితల్లితో కాసేపు ఆడుకున్నాడు. ఇంతలో అతనికి మరుసటి రోజు ‘రేషన్ల’ సంగతి గుర్తుకువచ్చి—.

"లక్ష్మీ! మర్చిపోయాను" అన్నాడు రావు గోడకు తగిలించిన కోటుతీస్తూ!

"శేషన్నకు డబ్బు యిద్దామన్న సంగతే మరచి పోయాను"

అంటూ కోటు జేబు తడవడం ప్రారంభించాడు రావు.

"నావద్ద సరిగా పది రూపాయలే ఉన్నాయ్‌. చాలినా అంతే చాలక పోయినా అంతే."

ఏదీ? నోటేదీ? ఎక్కడ పెట్టాడు ఆ పది రూపాయిలు? కోటు లోపలజేబులోనా? కనుపించ లేదే? పోనీ చొక్కా జేబులో ఉందేమోనని చొక్కా జేబు తడిమాడు. అక్కడ ఎక్కడుంటుంది? మరి ఆ పది రూపాయల కాగితం ఏమైనట్టు? అతనికి ఆశ్చర్యమయింది.

లక్ష్మి తన పెనిమిటి ముఖం ఎఱ్ఱ బారడం గమనించింది "కనిపిస్తుందిలెండి ఖంగారు పడకండి"

"ఎక్కడో ఉంటుంది. జేబులోపెట్టింది ఏమై పోతుంది?" అంది లక్ష్మి శాంతంగా.

ఆమె అలా అనడం అతనికి చుఱ్ఱుమంది. కోపం కూడా వచ్చింది.

"అయితే నీవే చూడు" అంటూ కోటు ఆమె ముఖాన విసిరాడు రావు. తానుకూడా చూచింది. కాని ఏమైందని? ఆయన జేబు రుమాలూ, ఏదో కొద్ది చిల్లర తప్ప ఆమెకు మరేమీ కనుపించలేదు.

"ఒకవేళ నోటు బయట ఎక్కడైనా పడి పోయిందేమో" అంది లక్ష్మి అతని ముఖం కేసి చూస్తూ!

"ఆఁ నీకు తెలుసు. మహాచెప్పొచ్చావు. అబ్బా! ఈ యింట్లో కొచ్చినప్పటినుంచీ ఇదేవరస వెధవ యిల్లు డబ్బు నిలిస్తేగా—ఆఫీసులో స్థిమితం లేదు. ఇంట్లో అంతకన్న లేదు" అంటూ రావు కేకలువేస్తూ చీదరించుకుని ముందు గదిలో కుర్చీలో కూలబడ్డాడు.

౨

ఇంతలో తన సహజమైన నవ్వుముఖంతో వేడి కాఫీ తీసుకువచ్చింది లక్ష్మి.

"నాకేం కాఫీఅక్కర్లేదు" అని అరిచాడు రావు. తాను ఏదైనా మాట్లాడితే ఇంక ఎగిరిపడ తారని పలక్కుండా కాఫీకప్పు బల్లమీదపెట్టి మెల్లిగా వంటింట్లోకి చక్కాపోయింది లక్ష్మి.

"ఏం నీకేం చెముడా? కాఫీ అక్కర్లేదని చెప్పలా?" అని గదిలోంచి రావు కేక—కాని కప్పులో కాఫీ సువాసన ఆఘ్రాణించేవరకూ నాలిక తడి అయింది రావుకు, ప్రాణం లేచివచ్చింది.

"కాఫీ తీసుకోనేలేదు; ఇహ అన్నంమాత్రం తింటారు గనుకనా" అనుకుంది లక్ష్మి. శుక్రవారం పూటా తిండితినకుండా ఆయనను వెళ్ళనివ్వకూడదని నిశ్చయించుకుంది. చిట్టితల్లి తన బుల్లిగ్లాసుతో తన తండ్రి దగ్గర భాగంకోసమని గదిలోకి వచ్చింది. అప్పటికి అతను కాఫీ త్రాగేశాడు. ప్రతిరోజూ ఓ చుక్క కాఫీ పోస్తేనేగాని వెళ్లేదికాదు. ఈరోజు! చిత్రం...! పిల్లని మరిచిపోయి కాఫీత్రాగేశాడు. అతనికి మనస్సు చివుక్కుమంది.

భోజనంవేళ అయింది. రావు పోసుకునేందుకు వేన్నీళ్లు సిద్ధంగా తోడిపెట్టింది. ఒళ్లురుద్దుకోను సబ్బు, తుడుచుకోను తువ్వాలు—రావు తొడుక్కునే పంట్లాము, చొక్కా, అన్నీ సిద్ధపరచింది.

అయితే అతనికోపం అంత త్వరగా చల్లారుతుందా? కాస్తగాలి తగిలితే చాలు కోపం నిప్పులా రగుల్కొంటుంది మంట అయేవరకూ! కోపం తాను చేసినతప్పు వల్లనేపుట్టి చివరికి పశ్చాత్తాపంలో తేలుతుంది. ఇదొక నిశ్చలసత్యం.

లక్ష్మి గడియారంవైపు చూచింది. అయిదు నిమిషాలు తక్కువ తొమ్మిది. ఈ సమయంలో తాను ఏ విధంగా ప్రవర్తించుకోవాలో ఆమెకు బాగా తెలుసు. రావు భోజనం తయారయిందా అనికేకేసేవరకూ భోజనం తయారయిందని చెప్పకూడదనుకుంది. ఒకవేళ అలా అడుగుతారనుకోండి. అడిగితే ఏమి సమాధానమివ్వాలో ఆమెకు తెలుసు. దానికి సమాధానం 'మీ కోసమే కాచుకుని కూర్చున్నా' నని అనాలని కూడా ఆమెకు తెలుసు. అంతే ఆయన భోజనానికి రావడం గబగబా పళ్ళెం ఖాళీ చేయడం—అంతా క్షణంలో జరిగిపోతాయి. అని ఏవేవో అనుకుంటుంది అయితే అనుకున్నది అనుకున్నట్లు జరుగుతుంది గనుకనా.

ఇంతలో రావు భోజనానికి వచ్చి కూర్చున్నాడు. లక్ష్మి వడ్డించడం ప్రారంభించింది.

"ఉఁ చాలు ఇకపెట్టకు" అన్నాడు రావు. లక్ష్మి తాను మామూలుగా వడ్డించినట్లే ఓకెరడు ఎక్కువగా పడింది కాబోలు. ఇంకేముంది—అమాంతంగా కంచంవెళ్ళి గోడకేసి కొట్టుకుంది. కంచంలో పెట్టిన అన్నం అంతా చిందర వందర అయిపోయింది. ప్రక్కన పెట్టిన గ్లాసెడు నీళ్లు బోర్లకిలపడి వొలికి పోయాయి.

గబగబాలేచి తను ఆ క్రితంరోజున తొడుక్కున్న పంట్లాము వేసికొని తన కోటు తగిలించుకో సాగాడు రావు.

"ఇదేమిటి ఈ నలిగిపోయిన ప్యాంటు వేసుకున్నారు! చాకలి తెచ్చినది దణ్ణెంమీద వేశానే." అంటూ గుమ్మంలో రావుకు అడ్డుగావచ్చింది లక్ష్మి.

"ఏమండీ! శుక్రవారంపూట తిండి తినకుండా వెళ్తారా? నామాటవినరూ?..." రావు మాట్లాడలేదు.

"ఎందుకంతకోపం చెప్పండి—నేనేంచేశానని" ఏంలాభం లక్ష్మి చెప్పినవన్నీ పెడచెవినేకాని అతను వింటేగా? ఆకోపానికేమైనా అర్థముందా? అపుడు ప్రక్కయింట్లో ఆడుతున్న చిట్టితల్లివచ్చి—

"నాన్నా! నాన్నా! ఆఫీసుకు ఇంత తొందరగా వెళుతున్నావేంటినాన్నా!" అంటూ అపుడే వీధిలో అడుగుపెట్టిన తండ్రిని సమీపించింది. ఇంట్లో జరిగిన కథసంగతి ఆకుర్రపిల్లకేం తెలుసు.

"నాన్నా! నా క్రికెటుబ్యాటు సంగతి మరచిపోకునాన్నా—తప్పకుండా సాయంత్రం పట్టుకు రావాలి."

"బ్యాటు కావాలానీకు—వేలెడు ఉన్నావో లేదో?" అంటూ వీపుమీద ఒక్కచరుపు చరిచాడు రావు. పాపం చిట్టితల్లిది లేతశరీరమేమో—నొప్పితో తల్లిదగ్గరకు పరుగునవచ్చి ఏడిచింది. ఇవన్నీ చూసేసరికి లక్ష్మి కళ్ళవెంట నీళ్లు గిర్రున తిరిగాయ్. "ఊరుకోతల్లీ ఏడవకు" అంటూ పొంగి పొరిలి వచ్చే దుఃఖం ఆపుకుంటూ—పాపం పెదిమ కర్చుకుంది—లోనికి వెళ్ళింది లక్ష్మి:—

## 3

రావు ఆఫీసుకు వెళ్లాడే కాని అతని మనస్సు స్థిమితం లేదు. మనస్సు మనస్సులో లేదు. ఏలా ఉంటుంది. పనిమీదకు దృష్టిపోతేగా? తనమీదే ఉంది తప్పు. తానే చేశాడు తప్పు చేసినతప్పు ఒప్పుకోవడం అంతటి సులభమైన పనికాదు. ఒకవిధమైన బాధ అతనిని వేధించింది. పాపం కుర్చీలో ఆలాగే కూర్చుని పోయాడు రావు. డబ్బు పోవడానికి తన భార్యా చిట్టితల్లీ బాధ్యులా? వాళ్ళమీద తనకెందుకింతకోపం? తనేం బాధ్యురాలుగాదు అన్నట్లు అమె ఎందుకు నటించాలి? ముఖం తుడుచుకోను తన ప్యాంటు జేబులో ఉన్న చేతి రుమాలు బయటకు తీశాడు. ఏదో జేబులోంచి క్రిందపడింది. ఏమిటా అని చూశాడు. ఏముంది? అదే పది రూపాయలనోటు. క్రిందికివంగి నోటు పైకి తీశాడు. ఆ నోటే. అనుమానం ఏమీ లేదు. ఇంతవరకూ నోటు తన ప్యాంటు జేబులోనే ఉందన్నమాట. రావు ప్యాంటులో పది రూపాయల నోటుపెట్టానన్న సంగతే మరచిపోయాడు

ఇంట్లో ఎంత హంగామా జరిగింది. ఎంతటి అవివేకం. సరిగా తన ప్యాంటు జేబు వెతుక్కోక పోవడం తనతప్పా? అమాయకురాలైన తన లక్ష్మి తప్పా? తాను ఎంత తెలివిమాలినపని చేశాడు. తన భార్యను కేకలు పెట్టి ప్రేమతో, అనురాగంతో తనను వెంటాడిన తన చిన్నారి-చిట్టితల్లిని కొట్టి పంపించిన చేతులేనా యివి? ఆ రోజు రోజంతా తాను లక్ష్మికి ఎంతటి దిగులు కల్పించాడు. ఆమె ఎంత ఆవేదనపడుతోందో పాపం. లక్ష్మి రోజంతా ఉపవాసం ఉంది కాబోలు. ఆమె మనస్సు ఎంత దుఃఖిస్తోందో!

అతనిసుఖం అతని దుఃఖం భార్యది మాత్రం కాదా—అయినప్పుడు భార్యను ఆవిధంగా నేనా చూట్టం? భర్తకు ఆమాత్రం వివేచనాశక్తి ఉండక్కర్లేదూ? భార్య ఎపుడూ ఎత్తిపాడిచే భర్త అడుగులకు మడుగులొత్తుతూ ఉండవలసిందే? భర్త గీచింది గీటూ—భార్యనోరు మూసుకుని ఉండవలసిందేనా?

రావుకు వళ్లు కంపరమెత్తింది. మనస్సు ఒక్కసారిగా విరిగి వేయివ్రక్కలయిన ట్లనిపించింది. హృదయంలో చండప్రచండమైన తుపాను చెల

రేగింది. అతని కళ్ళవెంబడి అప్రయత్నంగా అశ్రువులు రాలాయి.

ఈ విధమైన వివేచనా శూన్యమయిన పనులు ఇక తిరిగి చేయగూడదనుకున్నాడు. తన చిట్టితల్లికి బ్యాటూ, తన లక్ష్మికి మల్లెపువ్వులూ కొనుక్కొని చకచకా ఇంటి ముఖంపట్టాడు రావు.

"లక్ష్మి! నన్ను క్షమించవూ! నేను చేసిన తప్పుకు నీవు క్షమించవూ! నీమనస్సుకు ఎంతకష్టం కలిగించాను" అందా మనుకున్నాడు రావు. చిట్టితల్లి బ్యాటుచూస్తే ఎంత, సంతోషిస్తుందో. ఈ ఆలోచనలతో రావు మరింతత్వరగా నడవసాగాడు. గుమ్మంలో అడుగుపెట్టాడు.

గుమ్మంవద్ద తనకోసం నిరీక్షించే తన చిట్టితల్లి ఈరోజు అక్కడ కూర్చోలేదే? ప్రక్కయింటికి వెళ్లి ఆడుకుంటోందా?

"లక్ష్మి...!" మధురకంఠంతో పిలిచాడు రావు. అయితే సమాధానం రాలేదు. అతనిగుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయి. గబగబా గదిలోకి వెళ్లాడు. లక్ష్మి చిట్టితల్లి ప్రక్కకూర్చుని ఉంది. చిట్టితల్లి పక్కమీదపడుకుని ఉంది—ఎఱ్ఱబారినముఖంతో.

లక్ష్మి ప్రక్కనే నిలుచునివున్న రావు కేసి చూచింది: చిరునవ్వుతో 'అమ్మడూ' అంటూ రావు పిలిచాడు. "ఇదిగో నీకు బ్యాటు తీసుకువచ్చాను నాన్నా."

చిట్టితల్లి మరోవేపుకు తిరిగింది. రావు వంగి చిట్టితల్లి చేయి పరీక్షించాడు.

'పిల్లను ముట్టుకోవద్దు' అంది లక్ష్మి కొంచెం కోపంతో". చిట్టితల్లి పగలల్లా ఒకటే ఏడిచింది. జడుసుకుందో ఏమో ఒళ్లు కాలిపోతోంది. అంతా మీమూలానే"

"అయ్యో పాపం! వెఱ్ఱితల్లి. ఇదిగో వెళుతున్నా డాక్టర్ని పిల్చుకువస్తా" అంటూ బయటకు చక్కాపోయాడు రావ్.

* * * *

రెండు రోజులు పోయిం తరువాత చిట్టితల్లి బ్యాటుచూసి మురిసిపోయింది. ఆ మురిసిపోతున్న చిట్టితల్లి నెత్తుకొని ముద్దెట్టుకుని ఆనందంతో పొంగిపోయాడు రావు. వారిద్దరినీచూసి అనిర్వచనీయమైన ఆనందం అనుభవించింది లక్ష్మి.

